# 'శ్రావణ' బోనాల జాతర


కొత్తగూడెం టౌన్: బోనాలతో మహిళలు


పాల్వంచ: అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 25: సుజాతనగర్ మండలంలోని సిరిపురం గ్రామంలో బొడ్రాయి, గ్రామ దేవతలకు మహిళలు ఆదివారం శ్రావణ మాస బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్లతో సందడి సందడిగా ఈ బోనాల జాతర సాగింది.


పాల్వంచలో...


రామవరం: అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

### గాంధీనగర్‌లో..

పాల్వంచ, ఆగస్టు 25: పట్టణంలోని గాంధీనగర్ 5వ వార్డులోగల ముత్యాలమ్మ తల్లికి భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. తమను చల్లంగ చూడాలని వేడుకున్నారు.

### జీకేవోసీ గుట్టపై..

రామవరం, ఆగస్టు 25: సింగరేణి కొత్తగూడెం ఏరియా జీకేవోసీ గుట్టపైగల గుండాల సాయమ్మ తల్లికి భక్తులు ఆదివారం పూజారి రవి కుమార్ ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య, రుద్రంపూర్ సీతారామాలయం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలోగల గుండాల సాయమ్మ తల్లి గుడి వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

### ముత్యాలమ్మకు బోనాలతో మొక్కులు

చంద్రుగొండ, ఆగస్టు 25 : శ్రావణమాసం సందర్భంగా ఆదివారం పోకలగూడెంలో మహిళలు, గ్రామస్తులు ముత్యాలమ్మ కు బోనాలతో మొక్కులు చెల్లించారు. గ్రామం నుంచి ఇంటికో బోనంతో బయలుదేరిన మహిళలు, సాంప్రదాయ నృత్యాలతో, డప్పు వాయిద్యాలతో గ్రామంలోని బొడ్రాయి వద్ద పూజలు చేసి, ప్రదర్శనగా శివారులోని ముత్యాలమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించారు.


పోకలగూడెంలో బోనాల పండుగ సందర్భంగా నృత్యాలు చేస్తున్న మహిళలు

## గిరిజన నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 25: గిరిజన నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం ఎస్టీ సంఘాల ఐక్య వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు హాతీరాం, ఇర్పా ప్రకాష్ దొర, కేశవ్ నాయక్, ఉపేందర్ నాయక్, రాంజీ నాయక్, హాతీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అలింకో క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దుమ్ముగూడెం, ఆగస్టు 25: కొత్తగూడెంలోని ఆనందఖని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ నెల 27న జరిగే ఆలింకో క్యాంపును దివ్యాంగ బాలలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సున్నం సమ్మయ్య ఆదివారం తెలిపారు. వివరాలకు 7981104457, 9963280621ను సంప్రదించాలని తెలిపారు.

## కేరళ వరద బాధితులకు ఆర్థిక సాయం


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

దుమ్ముగూడెం, ఆగస్టు 25: కేరళ వయనాడ్ వరద బాధితుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన లక్ష్మీనగరంలో ఆదివారం విరాళాలు సేకరించారు. మండల సీపీఎం కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ.. కేరళలో భారీ వరదల కారణంగా వయనాడులో కొండలు విరిగి అనేకమంది మరణించారని, వరద బాధితుల కోసం వ్యాపారులు, ప్రజల నుంచి సేకరించిన నగదును బాధితులకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యలమంచి వంశీకృష్ణ, సాయిరాం రాజమ్మ, యలమంచి శ్రీనుబాబు, మహ్మద్‌బేగ్, గుడ్ల రామ్మోహనరెడ్డి, జి.తాతారావు, మద్ది శ్రీనివాసరెడ్డి, డింగి గురుమూర్తి, శివకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న రామచందర్

టేకులపల్లి, ఆగస్టు 25 : రాష్ట్రంలోని రైతులందరికీ రెండు లక్షల వ్యవసాయ రుణమాఫీ చేస్తానని ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి గుగులోత్ రామచందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ఏఐకేఎంఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28వ తేదీన అన్ని మండల కేంద్రాలలో ధర్నాను నిర్వహిస్తున్నామని దానిని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కల్తీ వెంకటేశ్వర్లు, డి.ప్రసాద్, బిల్లు నాగేందర్, బానోత్ వెంకట్రాం పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య

సారపాక, ఆగస్టు 25: పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బూర్గంపహాడ్ మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మల్లీశ్వరి శనివారం పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు భద్రాచలం ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మల్లీశ్వరి భర్త రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. మల్లీశ్వరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి కుమార్తె పవిత్ర ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మున్నూరుకాపుల మౌన దీక్ష

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 25: మున్నూరు కాపు కార్పొరేషన్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడాన్ని నిరసిస్తూ కాపు కులస్తులు ఆదివారం లక్ష్మీదేవిపల్లిలో ముఖాలకు కండువాలతో మాస్కులు ధరించి మౌన దీక్ష చేశారు. కాసా హనుమంతరావు, వల్లాల ప్రసాద్, తారక్, కోల నరసయ్య, పెంచాల సంపత్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.


మౌన దీక్ష చేస్తున్న మున్నూరు కాపులు

## అధ్వాన్నంగా చిల్డ్రన్స్ పార్క్

### పట్టించుకోని యాజమాన్యం

మణుగూరు టౌన్, ఆగస్టు 25: కళకళలాడాల్సిన పీవీకాలనీ ఏరియాలో చిల్డ్రన్స్ పార్క్‌లు కుక్కలు, పందులకు నిలయాలుగా మారాయని టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి ఆరోపించారు. ఆదివారం పీవీ కాలనీల్లోని నిరుపయోగంగా శిథిలావస్థలో ఉన్న పార్కులను ఆయన పరిశీలించారు. కార్మికుల పిల్లలకు పార్క్‌ల ద్వారా మెరుగైన సౌకర్యాలు కల్పించే బాధ్యత యాజమాన్యంపై ఉన్నప్పటికీ ఆ దిశగా అడుగులు వేయకపోవడం సరైంది కాదన్నారు. పిల్లల్లో చురుకుదనం, శారీరక శ్రమ ఆట నైపుణ్యాలతో జీవన ప్రమాణాలను మరింతగా పెంచుకునేందుకు ఏర్పాటు చేసిన పిల్లల పార్కులు కొంత మంది అధికారులకు కాసులు కురిపిస్తున్నాయని ఆరోపించారు. పార్కుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి వాటిని అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా యాజమాన్యం చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు.


నిరుపయోగంగా ఉన్న పార్క్‌లోని ఆటవస్తువులను పరిశీలిస్తున్న టీబీజీకేఎస్ నాగెల్లి వెంకట్

## చట్ట ప్రకారం ఎదుర్కొంటా..

### సొసైటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశా
### రైతుల వద్ద పక్కాగా రశీదులు ఉన్నాయి
### డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు

ఇల్లెందు రూరల్, ఆగస్టు 25 : తనపై దుష్ప్రచారాలు చేస్తూ కొంతమంది నిందారోపణలు చేస్తున్నారని వారిని చట్టప్రకారంగా ఎదుర్కొంటానని డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని మాణిక్యారం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా బస్తాలను అవకతవకలకు పాల్పడినట్లుగా వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. వర్షం కారణంగా యూరియా బస్తాలు తడిచిపోకుండా తన గోదాములో నిల్వ ఉంచానన్నారు. సొసైటీ అభివృద్ధికి తను ఎంతగానో కృషి చేశానన్నారు. నా రాజకీయ ఉనికితోపాటు వ్యాపారాన్ని దెబ్బతీసేందుకు కొంతమంది తెరలేపారన్నారు. కొంతమంది యూట్యూబ్ ఛానెల్‌కు సంబంధించిన వారు తనను దోషిగా నిలబెట్టేందుకు కుట్రలు పన్నారని వారిని చట్టప్రకారంగా ఎదుర్కొంటానన్నారు. సమావేశంలో పోశం వెంకటేశ్వర్లు, బానోత్ రమేశ్, పోతుగంటి రాము, బండారి సత్యం, రామటెంకి సత్యం, నిరీక్షణ, మల్లేశ్, కృష్ణ, రాజు, ఉపేందర్, సారయ్య, భార్గవ్, శ్రీకాంత్, దేశాయి, మురళి, శివ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి

### ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 25 : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని టీటీడీ సత్రంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల జూనియర్ డిగ్రీ కళాశాలను ఆయన ప్రారంభించి, వసతి, తరగతి గదులు, ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలను అలవర్చుకోవాలని, చదువుకుంటే సాధించలేనిది లేదన్నారు. విద్యార్థులు గొప్ప గొప్ప చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అధ్యాపకులు విద్యార్థుల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేకాధికారి బురాన్, అధ్యాయపక సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

## స్వాతంత్ర్య సంగ్రామంలో మొయినుద్దీన్ పాత్ర కీలకం

ఇల్లెందు రూరల్, ఆగస్టు 25 : స్వాతంత్ర్య సంగ్రామంలో ముగ్దూం మొయినుద్దీన్ సాయుధ రైతాంగ పోరాటం చేశారని ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ నభి అన్నారు. ఆదివారం ఏలూరి భవన్‌లో మొయినుద్దీన్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కీలక పాత్ర పోషిస్తూ స్వాతంత్ర్య సంగ్రామంలో మొయినుద్దీన్ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఆయూబ్, నజీర్, హుస్సేన్, ఆలేటి కిరణ్‌కుమార్, మన్యం మోహన్‌రావు, తాళ్ళూరి కృష్ణ, సంధ్య, పీఎల్ రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

## బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పాల్వంచ, ఆగస్టు 25: ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహన చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. గౌతంపూర్‌కు చెందిన నూటికుర్తి వెంకటేశ్వర్లు, పాల్వంచలోని బీటీపీఎస్ ప్రైవేట్ బస్సుకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఆదివారం బస్సుకు మరమ్మతులు చేసి, సాయంత్రం వేళ తన బైక్‌పై కొత్తగూడెం వైపు ఇంటికి వెళ్తున్నాడు. బస్టాండ్ సెంటర్‌లో అతడి బైక్‌ను ప్రైవేట్ బస్సు అతి వేగంగా వచ్చి ఢీకొని వెళ్లింది. వెంకటేశ్వర్లు బైక్‌పై నుంచి ఎగిరి, ఓ ఆటోపై పడ్డాడు. అతడి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ ఆటో డ్రైవర్ వెంటనే క్షతగాత్రుడిని పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెంలోని సింగరేణి ఆస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

## కొత్త బస్సులను ఏర్పాటు చేయాలి

ఇల్లెందు రూరల్, ఆగస్టు 25 : ఇల్లెందు ఆర్టీసీ డిపోలో కొత్తబస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి అన్నారు. ఆదివారం ఇల్లెందు ఆర్టీసీ డిపో ప్రథమ మహాసభ ఏలూరు భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లెందు డిపోలో ఆయిల్‌బంకును ఏర్పాటు చేయాలని, రెస్ట్ రూమ్ సౌకర్యం కల్పించాలని, మహిళలకు ప్రత్యేక వసతి కల్పించాలని, ఆర్వో ప్లాంట్, సైకిల్ స్టాండ్, ఐదు నెలల పెండింగ్ ఓటి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పల్లె వెలుగు సర్వీసులను చుట్టుపక్కల గ్రామాలకు విస్తరింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఎం. శ్రీనివాస్‌రావు, ఐనాల రాంబాబు, గడ్డం లింగమూర్తి, బాణాల రాంబాబు, సుధాకర్, బాబు, ఉపేంద్రాచారి, అంజి, నాగరాజు, వీలు, పీఎల్ రావు, జాకబ్, సైదమ్మ, అలి, బిక్షమయ్య, వేణు, సురేష్, శైలజ, మహేశ్వరీ, చైతన్య పాల్గొన్నారు.


జెండా ఎగురవేస్తున్న నాయకులు

## మున్నూరు కాపులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలి

దుమ్ముగూడెం, ఆగస్టు 25: ఏజెన్సీ ప్రాంతంలో మున్నూరు కాపులకు ఎలాంటి షరతులు లేకుండా కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు పూదోట సూరిబాబు డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యపటేల్ పిలుపు మేరకు ఆదివారం మండల కమిటీ ఆధ్వర్యంలో దుమ్ముగూడెంలోని గాంధీ విగ్రహం వద్ద పది నిముషాలు మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ.. మున్నూరు కాపుల సంక్షేమం కోసం కాపు కార్పొరేషన్ ద్వారా ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఎన్నికల్లో కాపులకు రాజకీయ పార్టీలు అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పత్తివాడ జగదీష్, కొండపల్లి నరేంద్ర, బైరెడ్డి సతీష్, కెల్లా శేఖర్, అల్లాడి వెంకటేశ్వరరావు, లంకా ప్రసాద్, కెల్లా శ్రీరాములు, పిల్ల సాయిబాబు, యాసాల ముత్యాలరావు, బైరెడ్డి అరవింద్, బండి సత్యనారాయణ, పిల్లా శివ, రాజేశ్ పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం వద్ద మౌన దీక్ష చేస్తున్న మున్నూరుకాపు సంఘం బాధ్యులు

## చలో ఎస్‌పీడీ హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

కరకగూడెం, ఆగస్టు 25: ఈ నెల 30న హైదరాబాద్‌లో తలపెట్టిన చలో ఎస్‌పీడీ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని ఐఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్లతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస వేతనాలు జీవో ప్రకారం 18 వేల నుంచి 28 వేల వరకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం హైదరాబాద్ పట్టణంలో చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శెట్టిపల్లి నాగేశ్వరరావు, సుజాత, విజయలక్ష్మి, సారమ్మ, రమణ, చిట్టెమ్మ, పార్వతి, సుజాత, రజిత, సునిత, నాగమణి, పద్మ, నమిత, అశ్విని, స్వరూప, సుధారాణి, సౌభాగ్యం పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లు

## కరాటే విజేతలకు బహుమతుల అందజేత

మణుగూరు టౌన్, ఆగస్టు 25: విద్యార్థులు చదువుతో పాటు స్వీయ రక్షణపై శిక్షణ అవగాహన కలిగి ఉండాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. ఆదివారం పీవీకాలనీలోని కోదండరామాలయంలో నిర్వహించిన కరాటే విజేతలకు ఆయన ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు వై.రాంగోపాల్‌తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యల పట్ల మాత్రమే కాకుండా వారి పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను కూడా ప్రోత్సహించే విధంగా ముందడుగు వేస్తున్న బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్‌కు కార్మికుల తరపున ధన్యవాదాలు తెలిపారు.


విజేతలతో ఏరియా జీఎం దుర్గం రాంచందర్

## కనుల పండువగా రామయ్య కల్యాణం


స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బూర్గంపహాడ్, ఆగస్టు 25: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం అర్చకులు అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణపుష్పాలతో అర్చనలు జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పాల్గొన్న భక్తులు మురిసిపోయారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణమూర్తులను ప్రాకార మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న 75 జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## రామయ్య సన్నిధిలో ఐపీఎస్ అధికారి


స్వామివారిని దర్శించుకుంటున్న గజరావు భూపాల్

బూర్గంపహాడ్(భద్రాచలం), ఆగస్టు 25: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారిని హైదరాబాద్‌కు చెందిన ఐపీఎస్ అధికారి గజరావు భూపాల్ ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తొలుత అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి గర్భగుడిలో పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం ఆలయంలోని శ్రీలక్ష్మీతాయారు అమ్మవారు, శ్రీఅభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి ఎమ్మెల్యే సన్మానం

పాల్వంచ రూరల్, ఆగస్టు 25: బదిలీపై వెళ్తున్న కిన్నెరసాని పంచాయతీ కార్యదర్శి అనిల్‌ను ఆదివారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సన్మానించారు. నాయకులు, స్థానిక పెద్దలు ఇమ్మానియేల్, అంకుష్‌పాషా, కొంగర శ్రీనివాసరావు, ఖాసిం, శంకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


అనిల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

## టీబీజీకేఎస్ మీటింగుకు రండి

రామవరం, ఆగస్టు 25: ఈ నెల 27న భూపాలపల్లిలో జరిగే టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ మీటింగుకు కేంద్ర కార్యవర్గ సభ్యులంతా హాజరుకావాలని రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ కోరారు. రామవరంలోని కార్యాలయంలో ఆదివారం జరిగని ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం 10 గంటలకు భూపాలపల్లిలోని కేటీకే5 కమాన్ వద్ద ఉన్న బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఈ మీటింగ్ ఉంటుందన్నారు. నాయకులు కూసన వీరభద్రం, గడప రాజయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాపు కృష్ణ

## ఓపీఎస్‌ను అమలుచేయాలి

టేకులపల్లి, ఆగస్టు 25 : పాత పెన్షన్ విధానం ఓపీఎస్‌ను అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ మండల కమిటీ సభ్యులు మూడ్ రమణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పూల్‌సింగ్, నాగునాయక్, హతీరాం, సురేశ్ పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి సన్మానం



ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులతో కోరం సురేందర్, ఉమ దంపతులు

టేకులపల్లి, ఆగస్టు 25 : టేకులపల్లి ప్రెస్ క్లబ్‌కు ఇటీవల ఎన్నికైన నూతన కమిటీని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోరం సురేందర్ ఆధ్వర్యంలో ఆదిఆరం ప్రెసెక్లబ్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా పాత్రికేయులను గౌరవించి సన్మానించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కోయగూడెం మాజీ సర్పంచ్ కోరం ఉమ, నాయకులు భూక్య సర్దార్, ఈది గణేష్, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ రంగ కార్మికులకు వైద్య పరీక్షలు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 25 : గుర్తింపు పొందిన భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల కుటుంబాలకు ఆదివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో కొత్తగూడెంనకు చెందిన సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్టినేటర్ షేక్ అక్బర్ అలీ మాట్లాడారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ జి మహేశ్‌తో పాటు సిబ్బంది సాగర్, ప్రసన్న, అంజలీ, పావని, దుర్గ, బాబి, రాణి, లావణ్య, నాగరాజు ఉన్నారు.


రక్తనమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది